ఆరోగ్యమస్తు!

- అందరికీ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం
- ఆ దిశగా విప్లవాత్మక అడుగులు
- 108, 104, 102, ఫ్యామిలీ ఫిజిషియన్, ఆరోగ్యశ్రీ పథకాలతో ప్రజలకు వైద్యసేవలు
- చికిత్సతో పాటు నివారణ వైపూ మొగ్గు
- నేడు ప్రపంచ ఆరోగ్య దినం

మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కల్తీ ఆహారం, పంటల్లో క్రిమిసంహారక మందుల వాడకం పెరగడం తదితర కారణాలతో మనిషికి వ్యాధులు చుట్టుముడుతున్నాయి. కొందరికి చిన్న వయస్సులోనే బీపీ, షుగర్, థైరాయిడ్, గుండెజబ్బులొస్తున్నాయి. దీంతో ప్రస్తుతం ఎవరైనా ఆరోగ్యంగా ఉంటే అదే రూ.పదికోట్లు అని భావిస్తున్నారు. నేడు (ఆదివారం) ప్రపంచ ఆరోగ్య దినాన్ని పురస్కరించుకుని జిల్లాలో ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలుపై ప్రత్యేక కథనం.

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఐదు సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఒక ఏరియా ఆసుపత్రి, రెండు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలు, 28 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఇవి గాక కొత్తగా మరో 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు జిల్లాలో మంజూరయ్యాయి. వీటితో పాటు ఐదు రక్త నిల్వ కేంద్రాలు, ఏడు బ్లడ్ బ్యాంకులు జిల్లాలో ఉన్నాయి. జిల్లాలో గత సంవత్సరం 44,685 మంది గర్భిణులు నమోదు చేసుకోగా కాగా (91.12శాతం), అందులో 40,971 మంది ఆసుపత్రుల్లో ప్రసవించారు. జిల్లాలో చిన్నారులకు 39,866 బీసీజీ, 39,109 ఓపీవీ, 37,587 హెపటైటిస్ బి, 46,296 ఓపీవీ 3వ డోసు, 46,437 పెంటావాలెంట్ 3వ డోసు, 46,148 ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేశారు. జాతీయ క్షయ నివారణ సేవల్లో భాగంగా గత సంవత్సరం 9,274 మందికి గళ్ల పరీక్షలు చేయగా 748 మందికి క్షయ ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. జాతీయ కుష్టు నివారణలో భాగంగా 2,500 మందికి పరీక్షలు నిర్వహించగా 209 మందికి వ్యాధి నిర్ధారణ అయ్యింది. జిల్లాలో 108 ద్వారా అంబులెన్స్ వైద్యసేవలు, 104 ద్వారా ఊళ్లోకే సంచార వాహన వైద్యసేవలు, 102 ద్వారా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు (గర్భిణిని ఇంటి వద్దకు దింపే కార్యక్రమం) దిగ్విజయంగా కొనసాగుతోంది. దాదాపుగా ప్రతి మండలానికి ఒక వాహనం లెక్కన వాహనాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు కొనసాగిస్తున్నారు.

దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణలో...

అసంక్రమిత వ్యాధుల నమోదులో భాగంగా 20,17,200 మందికి హెల్త్ ఐడీలు జనరేట్ చేయగా అందులో 60,405 మందికి రక్తపోటు, 44,893 మందికి మధుమేహం, 66 మందికి క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారించారు. వీటితో పాటు 42,893 మంది వయోవృద్ధులకు వైద్యసేవలు అందించారు. 12,636 మందికి ఫ్లోరోస్ పరీక్షలు నిర్వహించగా 363 మందికి లక్షణాలు బయటపడ్డాయి.

సీజనల్ వ్యాధులు అరికట్టడంలో...

జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణలో భాగంగా 71,262 మందికి రక్తపరీక్షలు చేయగా ఒకరికి చికున్‌గున్యా, ఒకరికి మెదడువాపు, 71 మందికి డెంగీ నిర్ధారణ అయ్యింది. రక్తహీనత నివారణ సేవల్లో భాగంగా 2,27,877 మంది బడిపిల్లలకు, 1,52,235 మంది అంగన్‌వాడీ పిల్లలకు ఐరన్ మాత్రలు ఇచ్చారు. 6,29,147 మందికి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు.



108 అంబులెన్స్‌లో వైద్యసేవలు



తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా సురక్షితంగా బాలింతను ఇంటికి తీసుకెళ్తున్న దృశ్యం (ఫైల్)

అందరికీ కంటి వెలుగు

డాక్టర్ వైఎస్ఆర్ కంటి వెలుగులో భాగంగా నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. మొత్తం 4,351 పాఠశాలల్లో 6,73,728 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 37,329 మందికి దృష్టిలోపాలు ఉన్నట్లు గుర్తించారు. వీరిలో 14,525 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. 164 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించారు. వీరితో పాటు 2,06,989 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించగా 35,786 మందికి దృష్టిలోపాలున్నట్లు గుర్తించి కంటి అద్దాలు పంపిణీ చేశారు. 47,536 మందికి క్యాటరాక్ట్(కంటిశుక్లము) శస్త్రచికిత్సలు నిర్వహించారు.

ఇంటివద్దకే వైద్యం

ఫ్యామిలి ఫిజిషియన్ విధానం ద్వారా గ్రామాల్లో నిర్దేశించిన దినాల్లో నెలలో రెండుసార్లు వైద్యాధికారులు ఆరోగ్య సంచార యూనిట్(104) ద్వారా 25 మండలాల్లోని 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోకి వెళ్లి సేవలందిస్తున్నారు. ఇందులో మొత్తం 67 రకాలైన మందులు ఇవ్వడంతో పాటు 67 రకాల పరికరాలతో వైద్యసేవలు అందిస్తున్నారు. చిన్న చిన్న వ్యాధులకు అక్కడే వైద్యం చేస్తున్నారు. దీంతో పాటు జగనన్న ఆరోగ్య సురక్ష ప్రోగ్రామ్ ద్వారా గ్రామాలు, వార్డుల్లో వైద్యశిబిరాలు నిర్వహించి ప్రజలకు ప్రాథమిక వ్యాధులన్నింటినీ వడబోసి చికిత్స చేస్తున్నారు. పెద్ద వ్యాధులేమైనా ఉంటే జిల్లా కేంద్రంలోని ఉన్నత ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 325 వైద్యశిబిరాలు నిర్వహించగా 1,13,632 మందికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రోగులను రెఫర్ చేసి చికిత్సలు అందించారు.

గ్రామాల్లో టెలిమెడిసిన్

ఎక్కడో గ్రామాల్లో ఉన్న ప్రజలు జిల్లా కేంద్రాలకు వచ్చి వైద్యసేవలు అందుకునే అవసరం లేకుండా వైఎస్ఆర్ విలేజ్ హెల్త్‌క్లినిక్‌లు, పీహెచ్‌సీల్లోనే టెలిమెడిసిన్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో టెలిమెడిసిన్ హబ్‌ను ఏర్పాటు చేసి అక్కడ స్పెషలిస్ట్ వైద్యులను నియమించారు. వీరు హెల్త్ క్లినిక్, పీహెచ్‌సీల నుంచి వచ్చే టెలికాల్స్‌కు టెలీఫోన్, వీడియో కాల్స్ ద్వారా సమాధానాలు ఇస్తూ రోగులకు ఆన్‌లైన్ వైద్యం అందిస్తున్నారు.

ప్రాణాలు పోస్తున్న ఆరోగ్యశ్రీ

జేబులో రూపాయి లేని వారు కూడా ఆరోగ్యశ్రీ కార్డు వెంట పెట్టుకుని వెళితే ఎంత పెద్ద కార్పొరేట్ ఆసుపత్రి అయినా ఉచితంగా వైద్యం అందిస్తున్నా రు. జిల్లాలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ఆరంభం నుంచి 6,06,270 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించగా రూ.1,416.77కోట్లు ప్రజలు లబ్ధిపొందారు. గత ఆరు నెలల్లో 48,255 మందికి శస్త్రచికిత్సలు నిర్వహించగా రూ.112.56కోట్ల లబ్ధి చేకూరింది.

వ్యాధుల నివారణే ప్రధానం



దీర్ఘకాలిక వ్యాధులు, కోవిడ్ లాంటి వైరస్‌లు మన దరి చేరకుండా ఉండాలంటే మన ఆహారపు అలవాట్లు మార్చుకోవాలి. వ్యాధులు వస్తే చికిత్స తీసుకోవడం ఎంత ముఖ్యమో అవి రాకుండా నివారణ పద్ధతులు పాటించడం అంతే ప్రధానం. బద్ధకం వల్ల వ్యాయామం, నడక చేయలేక పోవడం వల్ల ఊబకాయం, బద్ధకం, నీరసం వంటి ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి రోజూ కనీసం ఒక గంటపాటు వ్యాయామం చేయాలి.

–డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డీఎంహెచ్ఓ, కర్నూలు

ఆరోగ్యకర అలవాట్లు అలవర్చుకోవాలి



ఈ వేసవిలో అనేక జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. చిన్నపిల్లలు, వృద్ధులు వడదెబ్బకు గురికాకుండా చూసుకోవాలి. ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్న వారు క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదించాలి. మామిడి పండ్లను మోతాదుకు మించి తినకూడదు. సురక్షితమైన తాగునీటిని తాగాలి. స్వచ్ఛమైన గాలి, మంచి పోషకాహారం, నాణ్యమైన ఇంటి వాతావరణం, పర్యావరణ పరిస్థితులను ఏర్పాటు చేసుకోవాలి. ఇవి మన నాణ్యమైన జీవన విధానానికి తోడ్పడతాయి.

–డాక్టర్ వై. దివ్యలత, జనరల్ ఫిజీషియన్, కర్నూలు

క్లుప్తంగా

నేడు సి.బెళగల్ మండలంలో ఎన్నికల ప్రచారం

సి.బెళగల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి తెలిపారు. చింతమానుపల్లె, తిమ్మందొడ్డి, సంగాల, పలుకుదొడ్డి గ్రామాల్లో సాయంత్రం 4 గంటల నుంచి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ఎన్నికల ప్రచారం చేస్తారన్నారు. మండల నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

ప్రజలను అప్రమత్తం చేయండి

పాణ్యం: ఉష్ణోగ్రతలు పెరిగిన నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని తహసీల్దార్ ఫణికుమార్ సిబ్బందిని ఆదేశించారు. ఆయా గ్రామాల్లో మైక్‌లు, దండోరా ద్వారా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మధ్యాహ్న సమయాల్లో బయటకు రాకపోవడం మంచిదని.. ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేసుకునేలా చూడాలన్నారు. వృద్ధులు, చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

కూలిన ఇంటి పైకప్పు



కూలిన ఇంటిని చూపుతున్న బాధితుడు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామంలో ఓ ఇంటి పైకప్పు కూలిపోయింది. ఉక్కపోతగా ఉండడంతో శుక్రవారం రాత్రి ఇంటి బయట నిద్రించామని..శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో పెద్దశబ్దం రావడంతో భయాందోళకు గురై వెళ్లి పరిశీలించగా ఇంటిపైకప్పు కూలిపోయిందని ఇంటి యజమాని శేఖర్‌గౌడ్ తెలిపాడు. బయట నిద్రించడంతో ప్రమాదం నుంచి బయటపడ్డామని చెప్పాడు. గజ్జలకొండలో మైనింగ్ కోసం పెట్టే బ్లాస్టింగ్ వల్లే ఇల్లు కూలిపోయిందని ఆరోపించాడు. విషయం తెలుసుకున్న వీఆర్ఓ రమేష్‌సింగ్ ఇంటిని పరిశీలించారు.

ఉపాధి హామీ పథకంలో పూలతోటల సాగు

కోడుమూరు రూరల్: ఐదెకరాల్లోపు భూమి కలిగిన రైతులకు ఉపాధి హామీ పథకం కింద అన్ని రకాల పండ్ల తోటలు, మల్లె, గులాబి వంటి పూల తోటలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి అన్నారు. శనివారం ఎర్రదొడ్డిలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లోని కూలీలందరికి పనులు కల్పించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. వేసవి దృష్ట్యా పనులు జరిగే చోట కూలీలకు నీడ, నీటి వసతి కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట కోడుమూరు ఏపీఓ మోదీన్‌బాషా ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

ఓర్వకల్లు: పర్యావరణహిత జీవనశైలిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా సమన్వయకర్త రాజశేఖర్ అన్నారు. శనివారం నన్నూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. త్వరలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు. వాతావరణంలో వస్తున్న విపరీత మార్పులు, గ్లోబెల్ వార్మింగ్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. ఏపీఎన్‌జీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ మద్దిలేటి, హెచ్ఎం ప్రాణేశ్‌కుమార్, ఉపాధ్యాయులు హన్నాసీమోన్, గౌరినందనరెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కల్లూరు: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని ముజఫర్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్ అన్నారు. స్కూల్ ఈకో క్లబ్స్ వర్క్ షాప్ ఆధ్వర్యంలో శనివారం పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

మూడు పార్టీల అజెండా ఒక్కటే

కల్లూరు: టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీల అజెండా ఒక్కటే అని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి మండిపడ్డారు. శనివారం కల్లూరు అర్బన్ 37వ వార్డులో నిజం గెలవాలి యాత్ర నిర్వహించారు. చంద్రబాబు అరెస్టుతో మనస్తాపానికి గురై మృతి చెందిన టీడీపీ అభిమాని నరసింహులు కుటుంబాన్ని పరామర్శించి భరోసా పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్సీ అనురాధ, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత, నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, గౌరు వెంకటరెడ్డి, మల్లెల రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు.. ఐదుగురికి గాయాలు

పాణ్యం: మండలంలోని సుగాలిమెట్ట పిన్నాపురం క్రాస్ రోడ్డు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. పాణ్యం గోరుకల్లు తండాకు చెందిన కూలీలు పిన్నాపురంలో నిర్మాణ పనులు ముగించుకుని ఆటోలో తిరిగి వెళ్తుండగా నంద్యాల వైపు వెళ్తున్న కారు ఢీకొంది. లక్ష్మీబాయి, హనుమాబాయి, తిన్ని బాయి, చిన్ననాయక్, బుజ్జిబాయి గాయపడ్డారు. వీరిని నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

విద్యా నైపుణ్యాలను పెంపొందించాలి

సి.బెళగల్: ఉపాధ్యాయులు విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి, వారి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ జ్యోతి అన్నారు. శనివారం సి.బెళగల్ రెగ్యులర్ ప్రాథమిక పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులతో పాఠ్యాంశాలను చదివించి వారి సామర్థ్యాలను పరీక్షించారు. ఎస్ఏ-2 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. స్కూల్ హెచ్ఎం కిషోర్‌కుమార్ ఉన్నారు.

గడ్డివాములు దగ్ధం



అగ్నికి ఆహుతైన గడ్డివాములు

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు గ్రామంలో మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. బాధితులు, స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన న్యామత్‌ఖాన్, ఉస్మాన్‌బాషా పశుగ్రాసాన్ని స్థానికంగా ఓ కల్లంలో మూడు వాములు వేసుకున్నారు. శనివారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. స్థానికులు కర్నూలు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే మూడు గడ్డివాములు కాలిబూడిదయ్యాయి. ప్రమాదంలో రూ.2.50 లక్షల పశుగ్రాసంతో పాటు,నాయాబ్‌ఖాన్‌కు చెందిన 100 స్ప్రింక్లర్‌లు, పైపులు కాలిపోయినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గడ్డివాముల పక్కనే పేడదిబ్బ ఉందని.. అధిక ఉష్ణోగ్రతలతో మిథేన్‌వాయువు నుంచి మంటలు చెలరేగి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కోడుమూరు: సి.బెళగల్ మండలం గుండ్రేవులలో బోయ భాస్కర్‌కు చెందిన కల్లందొడ్డిలో 30 బాక్సుల(2880 ప్యాకెట్లు) కర్ణాటక టెట్రా ప్యాకెట్లను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. పోలకల్‌కు చెందిన రామకృష్ణకు సరఫరా చేయడానికి దాచినట్లు గుర్తించామన్నారు. వీటి విలువ రూ.1,81,500 ఉంటుందన్నారు. నిందితుడిని కర్నూలు కోర్టులో హాజరుపర్చగా, జడ్జి రిమాండ్‌కు ఆదేశించారని వివరించారు.

మోసం చేసేందుకే పొత్తులు



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని మహిళను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని ప్రజలు నమ్మరు
- మరోసారి వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: మరోసారి ప్రజలను మోసం చేసేందుకే టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు పెట్టుకున్నాయని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. అధికారం కోసం టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్ని కుట్రలు పన్నినా కూటమిని ప్రజల నమ్మరన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 41వ వార్డులో స్థానిక కార్పొరేటర్ శ్వేతారెడ్డి, నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు.అనంతరం కాటసాని మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందించామన్నారు. దీంతో లబ్ధిదారులే వైఎస్సార్ సీపీని గెలిపిస్తారని పేర్కొన్నారు. మరింత మంచి జరగాలంటే రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 2014 ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకుని చంద్రబాబు ఏ ఒక్క విభజన హామీ సాధించలేదన్నారు. ఈ విషయం ప్రజలకు గుర్తుందని వచ్చే ఎన్నికల్లో ఆయనకు ఓటుతో బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, వివిధ కార్పొరేటషన్ల డైరెక్టర్లు, వార్డు నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

విష్ణువర్ధన్‌రెడ్డి ఆటలు సాగనివ్వం


- విష్ణు మద్దతుదారుడిని ఓడిస్తాం
- మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, మణిగాంధీ



సి.బెళగల్‌లో మద్దతుదారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, మణిగాంధీ

సి.బెళగల్: కోడుమూరు నియోజకవర్గంలోని గ్రామాల్లో జరిగే గొడవలు, అల్లర్లకు, రాజకీయ హత్యలకు టీడీపీ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డే కారణమని మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ, ఎంపీపీ బొంతల మునెప్పతో కలిసి మద్దతుదారులతో సమావేశం నిర్వహించారు. వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఎన్నికల్లో విష్ణువర్ధన్‌రెడ్డి ఆటలు సాగనివ్వమని తెలిపారు. గ్రామాల్లో గూండాలను పెంచి పోషించే వ్యక్తి విష్ణు అన్నారు. అలాంటి సైకో మద్దతుతో ఎన్నికల బరిలో నిల్చున్న టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి బొగ్గుల దస్తగిరిని ఓడిస్తామన్నారు. విష్ణువర్ధన్‌రెడ్డి గ్రామాల్లో గొడవలను సృష్టించి మనుగడ సాధించాలని చూస్తారని, అలాంటి ఆకృత్యాలు ఇకపై సాగనివ్వమని తెలిపారు. కక్షలు, కార్పణ్యాలతో సొంత గ్రామం ఎదురూరు, పరిసర గ్రామాలైన ఆర్. కొంతలపాడు, నిడ్జూరు అభివృద్ధి చేసుకోలేని వ్యక్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాననడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. విష్ణువర్ధన్‌రెడ్డి మాటలను నియోజకవర్గ నాయకులు, ప్రజలెవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆయా గ్రామాల్లో ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. గుడిలేని గ్రామంగా ఉన్న ఎదురూరులో ఆలయ నిర్మాణం చేసినట్లు గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ కోడుమూరు అభ్యర్థి సతీష్ ఉన్నత విద్యావంతుడు, వైద్యుడు, సౌమ్యుడని.. ఆయనకు సంపూర్ణ మద్దతిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని మద్దతుదారులకు పిలుపునిచ్చారు. మణిగాంధీ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న వైఎస్సార్‌సీపీకి అండగా నిలవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, ఆదిమూలపు సతీష్‌ను భారీ మెజారిటీతో గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. పేదలు సంతోషంగా ఉండడం చంద్రబాబుకు ఇష్టం లేదన్నారు. వలంటీర్ వ్యవస్థపై కక్షగట్టి వృద్ధులను ఇబ్బంది పెట్టారని తెలిపారు. సింగల్‌విండో మాజీ చైర్మన్ సీబీ గోవిందరెడ్డి, రమేష్ ఆచారి, రఘురెడ్డి, బసయ్య, ఉల్చాల వెంకటేశ్వర్లు, ప్రకాష్ ఆచారి, లక్ష్మన్న పాల్గొన్నారు.

చంద్రమౌళీశ్వరరెడ్డి సేవలు స్ఫూర్తిదాయకం



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

ఓర్వకల్లు: అమరవీరుడు సీఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ మద్దికుంట చంద్రమౌళీశ్వరరెడ్డి దేశ సేవలో వీరత్వాన్ని పొందడం గర్వించదగ్గ విషయమని సీఆర్‌పీఎఫ్ అసిసెంట్ కమాండెంట్ మల్లె శివనాగరాజు అన్నారు. శనివారం చంద్రమౌళీశ్వరరెడ్డి వర్ధంతి సందర్భంగా స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో సంస్మరణ సభ ఏర్పాటు చేశారు. ఆయన చిత్రపటానికి పాఠశాల హెచ్ఎం రామచంద్రారెడ్డి, ఎంపీడీఓ మల్లీశ్వరి, కల్లూరు, ఓర్వకల్లు తహసీల్దార్లు మణివేలు, నటరాజన్, సర్పంచ్ నాగేశ్వరమ్మ నివాళులర్పించారు. ఓర్వకల్లు గ్రామానికి చెందిన చంద్రమౌళీశ్వరరెడ్డి 2010లో మావోయిస్టులకు, జవాన్లకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో వీరమరణం పొందారని తెలిపారు. ఆయన భార్య సరస్వతమ్మ, సింగిల్ విండో చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ పథకాల అమలు

- పేదలు బాగుపడితే చంద్రబాబు తట్టుకోలేరు
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్, కుడా చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి



కల్లపరిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్

కోడుమూరు రూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పథకాల అమలు సాధ్యమవుతుందని, ప్రజలంతా జగనన్నను ఆశీర్వదించి మరోసారి భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ప్రజలను కోరారు. శనివారం మండలంలోని కల్లపరి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదలకు చేస్తున్న మేలును తట్టుకోలేక టీడీపీ అధినేత చంద్రబాబు కుట్రలు, కుతంత్రాలు చేస్తూ ప్రజలను ఇబ్బందులపాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సజావుగా జరిగే పింఛన్ల పంపిణీని అడ్డుకుని అవ్వాతాతలను, దివ్యాంగులను తీవ్ర కష్టాలకు గురిచేశారని మండిపడ్డారు. ఇంటింటికి సంక్షేమ ఫలాలు అందాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్న చంద్రబాబుకు మరోసారి బుద్ధి చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై.రామయ్య, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆదిమూలపు సతీష్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుని జగనన్నకు కానుకగా ఇద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు లతమ్మ, పార్టీ నాయకులు పురంధర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గుంటెన్న, వెంకటేశ్వర్లు, తిరుమలరెడ్డి, నరసింహారెడ్డి, రఘునాథ్‌రెడ్డి, రాజారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మనోహర్, పెద్దయ్య, ప్రభాకర్, దస్తగిరి, మాదన్న, వెంకటేశ్వరరెడ్డి, విశ్వనాథ్, మల్లి, రామచంద్ర, ఈశ్వరరెడ్డి, రవి కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అండగా ఉంటా



దేవరాజును పరామర్శిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్

కర్నూలు సిటీ: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సి.బెళగల్ మండలం బ్యాతోలి గ్రామానికి చెందిన దేవరాజును వైఎస్సార్‌సీపీ కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ శనివారం పరామర్శించారు. డాక్టర్లతో ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్యమందించాలని కోరారు. అధైర్య పడకండి.. అండగా ఉంటానని ఈ సందర్భంగా దేవరాజ్ కుటుంబసభ్యులకు సతీష్ భరోసా ఇచ్చారు.


దమ్మున్న నేత వైఎస్ జగన్

కోడుమూరు రూరల్: మేలు జరిగి ఉంటేనే ఓటెయ్యండని అడుగుతున్న దమ్మున్న నేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, ఆదిమూలపు సతీష్ అన్నారు. మండలంలోని ముడుమలగుర్తి గ్రామంలో కర్నూలు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, ఎంపీపీ రూతమ్మ, కృష్ణాపురం సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ విజయ్‌కుమార్ రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రవీణ్ కుమార్, రమేష్‌నాయుడు పాల్గొన్నారు.

పనులు కల్పించాలని వినతి

కల్లూరు: మండలంలోని ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఏవీ నారాయణ, సీపీఎం మండల కార్యదర్శి మధు అన్నారు. ఈ మేరకు శనివారం డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు.

టీడీపీకి ఓటు వేస్తే మళ్లీ జన్మభూమి కమిటీలదే పెత్తనం



గడివేములలో ఎన్నికల ప్రచారం చేస్తున్న శివనరసింహారెడ్డి

గడివేముల: టీడీపీకి ఓటు వేస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు పెత్తనం చెలాయిస్తాయని.. సంక్షేమ పథకాల కోసం వారి చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తుందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి అన్నారు. శనివారం గడివేములలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 2014-19 కాలంలో ఏ పథకం కావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలను అందించారని తెలిపారు. అప్పటి పాలన.. ఇప్పటి పాలనను బేరీజు వేసుకుని ప్రజలు ఓటు వేయాలని కోరారు. సంక్షేమ పథకాలు సాఫీగా కొనసాగాలన్నా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించాలన్నారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పోచా బ్రహ్మానందరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ
- పిన్నాపురంలో ఎన్నికల ప్రచారం



ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ

పాణ్యం: ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాలు అభివృద్ధి చెందాయని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ అన్నారు. శనివారం పాణ్యం మండలంలోని పిన్నాపురం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేసిన మంచిని వివరించారు. ఎమ్మెల్యే కాటసాని పాణ్యం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని, ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపారని తెలిపారు. కొత్త ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారని, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడికి అండగా నిలవాలని కోరారు. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాడు మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. గతంలో ఈయన ఇచ్చిన హామీలను విస్మరించారని.. మరోసారి కొత్త హామీలతో వస్తున్నారని..వారి మాటలు నమ్మితే మోసపోతారన్నారు. అలాంటి నాయకులకే ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. ఆమెతో పాటు కర్నూలు డిప్యూటీ మేయర్ రేణుకా, జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, సర్పంచ్ ఎల్లక్రిష్ణయ్య, నాయకులు సత్యాలు, రమణ, కరుణాకర్‌రెడ్డి, సుబ్రమణ్యం, బాబు తదితరులు పాల్గొన్నారు.